

**ధర్మం.. శరణం.. గచ్ఛామి** బుద్ధ పూర్ణిమ జయంతి వేడుకలను పురస్కరించుకొని నగరంలోని హుస్సేన్ సాగర్ వద్ద బౌద్ధ మతస్థులు గురువారం లాంథర్లను గాల్లోకి వదిలారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 24 మే 2024 | HYDERABAD


## గ్రేటర్‌లో 2 రోజులు వర్షాలు

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. కాగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.1డిగ్రీలు, గాలిలో తేమ 58శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



# వీధిన పడిన విశ్వ నగర ఖ్యాతి

- ‘ఒకవేళ కర్ణాటక రాజకీయ నేతలు సీఎం బొమ్మై, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, కుమారస్వామి బెంగళూరులో మౌలిక వసతుల కల్పనను విస్మరిస్తూ.. కుల రాజకీయాల్లో మునిగితేలితే.. కంపెనీలకు భవిష్యత్తు గమ్యస్థానంగా హైదరాబాద్’ ఉంది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని టీ-హబ్, కేబుల్ బ్రిడ్జి, రహేజా మైండ్ స్పేస్ తదితర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి అద్దం పడుతుంది.
  - ఎయిమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రసాద్ గురు హైదరాబాద్ ఫొటోలను జోడిస్తూ గతంలో ట్వీట్ చేశారు.
- హైదరాబాద్‌లో తిరుగుతుంటే నేను ఇండియాలో ఉన్నానా? న్యూయార్క్‌లో ఉన్నానా? అని అనిపిస్తుంది.
  - తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంస
- హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలను చూస్తుంటే లాస్ ఏంజిల్స్‌లో ఉన్నామా? న్యూయార్క్‌లో ఉన్నామా? అని అనిపిస్తుంది.
  - సినీ నటి లయ అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత వ్యక్తం చేసిన అభిప్రాయం.
- నాది స్వస్థలం బెంగళూరు అయినప్పటికీ హైదరాబాద్ అంటేనే ఇష్టం. ట్రాఫిక్, మౌలిక వసతుల కల్పన సరిగా లేనందున బెంగళూరుకు పెట్టుబడులు కష్టం.
  - బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్‌షా స్పష్టీకరణ
- హైదరాబాద్‌లో మౌలిక వసతులు, అభివృద్ధిని చూసి ఇక్కడే స్థిరపడాలని ఉంది.
  - ప్రముఖ బాలీవుడ్ నటుడు బాబీడియోల్ మనోగతం
- హైదరాబాద్ చాలా అభివృద్ధి చెందింది. 1990లో చూసిన తర్వాత ఇప్పుడు చూస్తే చాలా అభివృద్ధి జరిగింది.
  - బీజేపీ ఎంపీ సన్నీడియోల్

**నిన్నటిదాకా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు దక్కిన పల్లకీల మోత. మరి ఇప్పుడు?**

### నగరంలోని రోడ్ల దుస్థితిపై ఓ మహిళ వినూత్న నిరసన

### ఆనంద్‌నగర్ చౌరస్తాలోని వరద నీటిలో కూర్చుని నిలదీసిన నిహారిక

### ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మరమ్మతులు చేస్తామన్న అధికారులు

**ఎట్లుండే.. హైదరాబాద్ ఇప్పుడెట్లాయే?**

### ఇటీవలనే రూ.221.73 కోట్ల ఎస్‌ఐజీ పనులను రద్దు చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

మన్సూరాబాద్, ఎల్బీనగర్, మే 23 : హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరు, న్యూ జీవీఆర్ కాలనీకి చెందిన నిహారిక ప్రైవేటు ఉద్యోగి. నిహారిక పిల్లలు ఇద్దరు నాగోల్, బండ్లగూడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ప్రతి రోజు ఆమె తన స్కూటీపై పిల్లలను పాఠశాలకు తీసుకుపోతుంది. ఈ క్రమంలో ఆనంద్‌నగర్ చౌరస్తా పరిసరాలతో పాటు బండ్లగూడ సర్కిల్‌లో రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాజీవ్ స్వగృహ సముదాయాల నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తా మీదుగా బండ్లగూడ చౌరస్తా వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఒకవైపు గుంతలు.. మరోవైపు గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో గురువారం ఉదయం నిహారిక తన పిల్లలతో కలిసి స్కూటీపై నాగోల్ వైపునకు వెళ్తుండగా ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద గుంతలమయంగా మారిన రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పిల్లలతో సహా కింద పడ్డారు. స్వల్ప గాయాలు కావడంతో పిల్లలను ఇంటిలో వదిలి పెట్టి, తిరిగి తన ఆవేదనను వ్యక్తం చేసేందుకు అక్కడకు వచ్చింది. గుంతలమయంగా మారిన రోడ్లలో పేరుకుపోయిన బురదనీటిలో కూర్చుని ‘రోడ్లు బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి’ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. అర గంట పాటు ఆమె బురదలో కూర్చుని ఆందోళన చేపట్టారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వచ్చి స్పష్టమైన హామీనివ్వాలని అప్పటి వరకు నిరసనను విరమించేది లేదంటూ ఆమె భీష్మించుకు కూర్చున్నారు. ట్రాఫిక్ పోలీసులు వచ్చి నచ్చ చెప్పినా ఆమె ససేమిరా అన్నారు. విషయాన్ని తెలుసుకుని నాగోల్ కార్పొరేటర్ భర్త చింతల సురేందర్‌యాదవ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని ఎన్నికల కోడ్ ఉన్నందునే పనులు చేపట్టలేదని తెలిపారు. కోడ్ ఎత్తివేయగానే రోడ్లను బాగు చేస్తామని ఆమెకు హామీనిచ్చారు. ముందస్తుగా యుద్ధప్రాతిపదికన గుంతలను మట్టితో పూడ్చి, ప్రమాదాలు జరుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో నిహారిక తన నిరసన విరమించారు. గురువారం సాయంత్రం ఆగమేఘాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు వచ్చి మట్టితో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

### ఎప్పటికప్పుడు పూడుస్తున్నాం

ఈ సంఘటన తర్వాత హయత్‌నగర్ సర్కిల్ ఈఈ రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. తమ పరిధిలోని రోడ్లపై గుంతలను ఎప్పటికప్పుడు పూడుస్తున్నట్లు చెప్పడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశానుసారం ఐఆర్టీ బృందంతో గుంతలను పూడుస్తున్నట్లు చెప్పారు. వాస్తవానికి నాగోల్ ఎక్స్ రోడ్డు నుంచి బండ్లగూడ తాజా టిఫిన్స్ వరకు ఉన్న రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుందన్నారు. ఎనిమిదేండ్ల కిందట హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ వారు ఈ రోడ్డును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కొంతకాలం కిందట రోడ్డు అక్కడక్కడ బాగా దెబ్బతినడంతో తిరిగి జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతులకు వేర్వేరుగా రూ.1.99 కోట్ల చొప్పున రెండు ప్రతిపాదనలు కూడా పంపామన్నారు. అయితే ఇటీవలనే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏకంగా ఎస్‌ఐజీ కింద చేపట్టిన 756 పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ రద్దు చేయడం తెలిసిందే.

### గుంతలను పూడ్చి.. ప్రాణాలు కాపాడండి: నిహారిక

నాగోల్ చౌరస్తా నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తా మీదుగా హిందూ అరణ్యకు వెళ్లే మార్గంలో సుమారు 30 ప్రదేశాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలమయంగా మారిన రోడ్లతో చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని గతంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఎక్స్‌లో ట్వీట్ చేసి తెలియజేసినా స్పందించ లేదు. రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పుడు వర్షాలు పడుతుండటంతో గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రమాదకరంగా ఉన్న గుంతలో నాతో పాటు అనేక మంది వాహనదారులు కింద పడి గాయాలయ్యాయి. ఇంకెన్నాళ్లు భరించాలి?





*ఈ ఫొటో చూడండి..* ఓ మహిళ నగరంలోని రోడ్ల దుస్థితి, అధికారుల నిర్లక్ష్యంపై కడుపు మండి వినూత్నంగా వ్యక్తం చేస్తున్న నిరసన. ఆమె ఒక రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్త కాదు.. ప్రతిపక్ష నేత అంతకన్నా కాదు! ఒక సాధారణ మహిళ. నిత్యం తన పిల్లల్ని పాఠశాలకు పంపించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్లపై గుంతలతో ఆమె పడే బాధ అంతా ఇంతా కాదు. ఎంతకీ అధికారులు గుంతలను పూడ్చకపోవడంతో భరించలేక రోడ్డుపై గుంతలోని వరద నీటిలో కూర్చుని ప్లకార్డులను ప్రదర్శించింది. మహాప్రభో.. నగరంలో రోడ్లను బాగు చేయండి అంటూ వేడుకుంది. కొన్ని నెలలుగా నగరంలోని రహదారులను పట్టించుకునే దిక్కులేక ఇలాంటి నిరసనలు మొదలయ్యాయి.



సీఎం రేవంత్ రెడ్డికి బౌద్ధ మత గ్రంథాన్ని అందజేస్తున్న బౌద్ధ మత పెద్దలు

## గౌతమ బుద్ధుడి సూచనను ఆదర్శంగా తీసుకోవాలి

### సీఎం రేవంత్ రెడ్డి

మారేడ్‌పల్లి, మే 23 : గౌతమ బుద్ధుడి సూచనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం కంటోన్మెంట్‌లోని మహేంద్రహిల్స్‌లో నిర్వహించిన బుద్ధ పూర్ణిమ జయంతి వేడుకలను సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బుద్ధ భవన్ నిర్మాణానికి, నిర్వహణకు గత ముఖ్యమంత్రులు విజయ్ భాస్కర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ఏ విధంగా సహకరించారో.. ఇప్పుడు కూడా ప్రత్యేక నిధులు కేటాయించి ధ్యాన మందిరం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బుద్ధ భవన్‌లో పాఠశాల నిర్మాణం చేపడితే బాగుటుందని సూచన చేశారు. అదనపు డీజీపీ శివధర్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, మహబోధి సంఘ నేతలు శేఖర్, చేతన్, బుద్ధ పాల, సీనియర్ నాయకులు శ్రీ గణేశ్, సీతారాం రెడ్డి, సంజీవ రెడ్డి, పాల్గొన్నారు.



## ఎంఆర్‌డీసీఎల్ ఎస్‌ఈ వెంకటరమణ మృతి

సిటీబ్యూరో, మే 23, (నమస్తే తెలంగాణ) : మూసీ నది అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) సూపరింటెండెంట్ ఇంజినీరు ఎస్.వెంకటరమణ గురువారం మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయన దాదాపు 24 రోజులుగా సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశంలో ఉండగా.. చెమటలు పట్టడంతో ఆయనను యశోద ఆసుపత్రికి తరలించారు. ఆ రోజు నుంచి కోమాలోనే ఉన్న వెంకటరమణ గురువారం మృతిచెందినట్లు యశోద వైద్యులు ప్రకటించారు. శుక్రవారం నగరంలోని లాలాపేట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుపనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వివిధ హోదాల్లో పనిచేసిన వెంకటరమణ పదవులకు వన్నె తీసుకువచ్చారని ఇంజినీర్లు గుర్తు చేసుకున్నారు.



## ‘మురుగునీరు దాటితేనే.. కలెక్టరేట్‌లోకి’..

**స్పందించిన కలెక్టర్**

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం మురుగునీటితో ఆహ్వానం పలుకుతుందని.. మురుగునీరు దాటితేనే కలెక్టరేట్‌లోకి ప్రవేశమని ఉటంకిస్తూ బుధవారం ‘నమస్తే తెలంగాణ’ కథనం ప్రచురించింది. ఈ కథనంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు ముఖద్వార పనులను చేపట్టారు.

# జీహెచ్‌ఎంసీలో కీచకులు!

## మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులు.. భయపెట్టి కామకలాపాలు

### నాడు డీసీ, ఎస్‌ఈ, నేడు ఎస్‌ఎఫ్‌ఏలు

### గాజులరామారం సర్కిల్‌లో మహిళా కార్మికురాలిపై అఘాయిత్యం

### వీడియోలు దగ్గరపెట్టుకొని మరో కార్మికుడి బెదిరింపులు

### వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్..

### సూపర్‌వైజర్లు కిషన్, ప్రణయ్‌లను విధుల నుంచి తొలగించిన కమిషనర్ రొనాల్డ్ రాస్

### పట్టించుకోని వేధింపుల నివారణ కమిటీ

### ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలంటున్న మహిళా ఉద్యోగులు

సిటీబ్యూరో/ కుత్బుల్లాపూర్, మే 23 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో మహిళా ఉద్యోగులకు భద్రత కరువైంది. కార్మికుల నుంచి అధికారిణి వరకు కీచకుల నుంచి లైంగిక వేధింపులు తప్పడం లేదు.. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కారం) చట్టం 2013ను పక్కాగా అమలు చేయాల్సిన చోట జీహెచ్‌ఎంసీలో తరచూ ఏదో ఒక చోట ఘటన వెలుగులోకి వస్తూనే ఉంది. తాజాగా గాజులరామారం సర్కిల్-25లో శానిటేషన్ విభాగంలో ఎస్‌ఎఫ్‌ఏగా ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిగా పనిచేస్తున్న కిషన్ భాగోతం బయటపడింది. మహిళా శానిటేషన్ వర్కర్‌పై లైంగిక వేధింపులపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో జోనల్, డిప్యూటీ కమిషనర్, మెడికల్ ఆఫీసర్‌లతో విచారణ జరిపించారు. వారు నివేదిక అందించడంతో కఠినమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ (ఎస్‌ఎఫ్‌ఏలు/శానిటరీ ఫీల్డ్ ఆఫీసర్) పి.కిషన్, సీహెచ్ ప్రణయ్‌లను విధుల నుంచి తొలగించారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే లైంగిక వేధింపుల నుంచి సురక్షితమైన, భద్రతతో కూడిన పని వాతావరణాన్ని కల్పించాలని మహిళా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కాగా జీహెచ్‌ఎంసీలో వేధింపుల నివారణ కమిటీ వేసినా తూతూ మంత్రంగానే ఉండడం గమనార్హం.

### మొన్న చార్మినార్.. నిన్న ఎల్బీనగర్‌లో..


గతంలో చార్మినార్ జోన్‌లో ఓ స్టాటజికల్ ఆఫీసర్ (బలమైన సామాజిక వర్గానికి చెందిన అధికారి) మహిళా ఉద్యోగి (కంప్యూటర్ ఆపరేటర్)పై లైంగిక వేధింపుల ఘటనపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి స్వయంగా బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై స్పందించిన మేయర్ వెంటనే సదరు అధికారిపై విచారణకు ఆదేశించి, నివేదిక ఆధారంగా సస్పెండ్ వేటు పడింది. ఇదే సమయంలో కూకట్‌పల్లి జోన్‌లో ఓ డీసీ.. ప్రస్తుతం ఎల్బీనగర్ సర్కిల్‌లో చేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఓ మహిళపై జరిపిన లైంగిక వేధింపులను తానే స్వయంగా సోషల్ మీడియా వేదికగా బయట పెట్టారు. డీసీ స్థాయి అధికారి కావడంతో పైరవీతో ఆయనపై ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఎస్‌ఈ స్థాయి అధికారి ఓ మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడితే సదరు బాధితురాలు షీ టీంకు ఫిర్యాదు చేసింది.



గాజులరామారం సర్కిల్ కార్యాలయం

### ఇంట్లో పెండ్లి.. ఫొటోలు బయటకు

ప్రతి రోజు పనిచేసే కార్మికులను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో స్కానింగ్ అటెండెన్స్ తీసుకోవాలి. తన ఇంట్లో పెండ్లి ఉండడంతో అటెండెన్స్ తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తకుండా తన వద్ద పనిచేసే మరో వర్కర్ ప్రణయ్ అనే ఔవుట్ సోర్సింగ్ కార్మికుడికి తన సెల్‌ఫోన్ ఇచ్చి పంపాడు. సదరు వర్కర్ సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియోలు, ఫొటోలు కన్పించడంతో ఎస్‌ఎఫ్‌ఏ కిషన్, సదరు మహిళా కార్మికురాలిని మందలించాడు. అంతటితో ఆగకుండా వారి వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోవడంతో సదరు వర్కర్ వీడియోలు, ఫొటోలు ఆన్‌లైన్ మాధ్యమంలో పెట్టాడు. దీంతో విషయం జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి రావడంతో ఎస్‌ఎఫ్‌ఏ కిషన్‌ను గత వారం రోజుల కిందట విధుల నుంచి తప్పించారు.



మహిళా కార్మికురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన ఎస్‌ఎఫ్‌ఏ కిషన్

### జరిగిన ఘటన..

గాజులరామారం సర్కిల్ -25లో గత ఐదేండ్లుగా శానిటేషన్ విభాగంలో శ్రీదుర్గా భవానీ ఏజెన్సీలో కిషన్ అనే వ్యక్తి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎస్‌ఎఫ్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సర్కిల్ పరిధి సూరారం డివిజన్ షాపూర్‌నగర్ ఏరియాలో ఎస్‌ఎఫ్‌ఏగా పని చేస్తుండగా తన కింద మూడు బ్యాచ్‌లకు చెందిన 21 మంది మున్సిపల్ స్వీపర్ కార్మికులు పని చేస్తున్నారు. అయితే అందులో పని చేసే ఓ మహిళా వర్కర్‌ను కిషన్ గత కొంతకాలంగా లోబర్చుకొని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో తన సెల్‌ఫోన్‌లో వీడియోలు, ఫొటోలు తీసుకున్నాడు.

### డబ్బులు ఇవ్వకపోవడంతో లీకైన వీడియోలు

ఎస్‌ఎఫ్‌ఏ కిషన్ ఆరాచకాలను పసిగట్టిన అవుట్‌సోర్సింగ్ కార్మికుడు ప్రణయ్ తన డిమాండ్లకు అంతులేకుండా పోయినట్లు సమాచారం. వీరికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు లీక్ కాకుండా ఉండాలంటే తాను అడిగినంత డబ్బులు ఇస్తే సరి.. లేదంటే సోషల్ మీడియాలో పెడుతానని పలుమార్లు ఎస్‌ఎఫ్‌ఏతో పాటు బాధిత కార్మికురాలిని బెదిరింపులకు గురి చేశాడు. దీనికి వారు సమాధానం ఇవ్వకపోవడంతో ప్రణయ్ వీడియోలు లీక్ చేయడంతో బాగోతం బయటపడింది. దీంతో సర్కిల్ ఉన్నతాధికారులు ప్రణయ్ భాగస్వామ్యం ఉండడంతో విధుల నుంచి తొలగించిన్నట్లు వెళ్లడించారు.

### వేధింపులు మరెన్నో..

కుత్బుల్లాపూర్-గాజులరామారం సర్కిళ్లలో పని చేస్తున్న మహిళా కార్మికులు తమ పైస్థాయి అధికారుల నుంచి అనేక వేధింపులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పొరపాటుగా సెలవు కోరినా, ఒంట్లో బాగాలేకున్నా తప్పనిసరిగా పనికి రావాల్సిందేనని లేని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని ఎస్‌ఎఫ్‌ఏలు బెదిరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఓ మహిళా కార్మికురాలు ఓటు వేసేందుకు తన ఊరికి వెళ్లగా మరుసటి రోజు ఆలస్యం కావడంతో విధులకు రాలేకపోయింది. దీంతో సదరు ఎస్‌ఎఫ్‌ఏ తీవ్రస్థాయిలో మందలించి వారం రోజుల వరకు పని చేయకుండా అడ్డుకున్నాడు. చివరకు వారి పైస్థాయి అధికారి వద్ద ఓ బాండ్ పేపర్ పెట్టుకొని విధులకు తిరిగి చేర్చుకున్నారని సమాచారం. మరో కార్మికురాలు తాను పనులు చేయలేని పరిస్థితిలో ఉన్నానని తనవంతుగా తన కొడుకుకు పని ఇప్పించాలని వేడుకోవడంతో దాదాపుగా రూ.2.50 లక్షల వరకు డిమాండ్ చేసినట్లు సమాచారం.

### అధికారులకు అంతా తెలిసినా గప్‌చుప్

కార్మికులకు తలెత్తే అనేక ఇబ్బందుల పట్ల ఉన్నతాధికారులకు తెలిసినా తదుపరి చర్యలు తీసుకోకుండా గప్‌చుప్‌గా ఉండడమే ఈ సంఘటనలకు తావునిస్తుందని చర్చ జరుగుతుంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సమయంలో కిందిస్థాయిలో ఏం జరుగుతుంది..? దీనికి కారణాలు తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకుండిపోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఆరాచకాలకు ఊతమిచ్చిన్నట్లు మారుతుంది.